సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 29 । మే । 2024

మీనం.. దైన్యం

భానుడి ప్రతాపానికి చెరువులు ఎడారులను తలపిస్తుండగా అందులోని చేపలు విలవిల్లాడుతున్నాయి. ఒక్కసారిగా నీటి నిల్వలు తగ్గిపోతుండటంతో చేపలన్నీ మృత్యువాత పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. వివరాలు 8లో


సంగారెడ్డి నుంచి అందోల్ వెళ్లే దారిలో ఉన్న చెరువులో చనిపోయిన చేపలు

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో హుకట్‌నగర్, శాంతినగర్, రాంనగర్, హమాలీకాలనీ, హౌసింగ్‌బోర్డు, ఐడీఎస్ఎంటీ, షహీన్‌నగర్, గాంధీనగర్, డ్రైవర్స్ కాలనీ, బాగారెడ్డిపల్లి, ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్జీవోస్ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, సుభాష్‌గంజ్, తహసీల్దార్ కార్యాలయం, బ్లాక్‌రోడ్డు, రైల్వే స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, బాగారెడ్డి స్టేడియం, ఏరియా, మెయిన్‌రోడ్డులో ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఖేడ్‌లో డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఖేడ్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అవసరమైన సౌకర్యాల కల్పనతోపాటు సమస్యలు, సర్వీసుల నిర్వహణ, సలహాలు, సూచనలు ఇవ్వడానికి 99592 23170 నంబరుకు ఫోన్‌చేసి వివరించాలని సూచించారు.

ప్రకృతి వనాల్లో మొక్కలు పెంచండి


పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

కల్హేర్(నారాయణఖేడ్): పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆదేశించారు. మంగళవారం నిజాంపేట మండలం మునిగేపల్లిలో పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి వినియోగంలో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సంజీవరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

సంగారెడ్డి టౌన్ : రాయితీలపై పచ్చి రొట్ట విత్తనాలు సరఫరా చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాకు 3900 క్వింటాల జీలుగు, 1981 క్వింటాల జనుము విత్తనాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిని 54 కేంద్రాలలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

క్యూలో పాస్ పుస్తకాలు


కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఎదుట లైన్‌లో పెట్టిన పాస్ పుస్తకాలు

పాపన్నపేట(మెదక్): జీలుగ కోసం పట్టాదారు పాస్ పుస్తకాలు రోడ్డెక్కాయి. మండుటెండల్లో క్యూలైన్లో నిలబడే ఓపిక లేక అన్నదాతలు వాటిని లైన్లో పెట్టి పడిగాపులు కాశారు. మండలపరిధిలోని కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఎదుట మంగళవారం ఈ దృశ్యాలు కనిపించాయి. రైతులు పాపన్నపేటలోని ఆగ్రో సర్వీస్ సెంటర్‌కు, కొత్తపల్లిలోని సొసైటీ వద్దకు చేరుకున్నారు. కొత్తపల్లిలో లైన్ ఎక్కువగా ఉండటంతో ఎండలో నిలబడలేక రైతులు తమ వెంట తెచ్చుకున్న పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు సొసైటీ ఎదుట లైన్లో ఉంచి గంటల తరబడి వేచి ఉన్నారు. చివరకు మధ్యాహ్నం సమయంలో సొసైటీ వారు జీలుగ పంపిణీ చేశారు. అయితే కొందరికి బస్తాలు దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై ఏఈఓ నాగకృష్ణ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న సాలభ్యతను బట్టి మన మండలానికి 380 క్వింటాళ్ల జీలుగ వచ్చిందన్నారు.

500 టన్నులు అవసరం

పాపన్నపేట మండలంలో సుమారు 28 వేల ఎకరాల సాగు భూమికి 500 టన్నుల జీలుగ అవసరం. జిల్లాకు కేటాయించిన స్టాక్ ను బట్టి 650 క్వింటాళ్లు పంపాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణ జిల్లా అధికారులకు నివేదించారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా 373 క్వింటాళ్లు వచ్చింది. పాపన్నపేటలోని ఆగ్రో సర్వీస్ సెంటర్‌కు 150 క్వింటాళ్లు, కొత్తపల్లి రైతు సేవా సహకారం సంఘానికి 223 క్వింటాళ్లు సరఫరా చేశారు.

జలం.. ఒడిసి పట్టేద్దాం

లక్ష్యానికి చేరువలో ఇంకుడు గుంతల నిర్మాణం

- గ్రామాల్లో జోరుగా నిర్మాణాలు
- భూగర్భజలాల అభివృద్ధికి ప్రత్యేక కృషి
- జిల్లాలో మంజూరు 32,504
- ఇప్పటి వరకు పూర్తయినవి 28,154

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రతీ వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే పెద్ద మొత్తంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. అంతేకాకుండా వరుస కరువులోనూ బావులు, బోర్లలో నీరు లభించే అవకాశాలు ఉంటాయి. అందువల్ల నీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృథా నీటిని ఒక చోటికి చేర్చితే భవిష్యత్ తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని మేధావులు పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో రానున్న నీటి సమస్యను ఎదుర్కొనేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాల్సి ఉంటుంది. వీటిని నిర్మించుకుంటున్న కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.

జిల్లాలో నిర్మాణం ఇలా..

జిల్లాలో 32,504 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి. ఇందులో 31,354 వ్యక్తిగత ఇంకుడు గుంతలు కాగా, 1150 సామూహిక ఇంకుడు గుంతలు ఉన్నాయి. ఇప్పటి వరకు 28,154 గుంతల నిర్మాణ పనులు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ఉపాధి పథకం నుంచి నిధులు



ప్రభుత్వ చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణానికి అవసరైన నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరవుతాయి. వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.4900, సామూహిక ఇంకుడు గుంతకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు మంజూరు చేస్తుంది. ప్రతీ కుంటుంబం ఇంకుడు గుంత నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో జిల్లాలో వీటి నిర్మాణం చకచకా కొనసాగుతున్నాయి.

జాబు కార్డు ఉన్నవారందరికీ..

ఉపాధి హామీ పథకంలో జాబు కార్డు కలిగిన వారందరూ వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించుకోవడానికి అర్హులు. వీరు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇంకుడు గుంతల నిర్మాణానికి అనుమతి ఇస్తారు. ప్రస్తుతం వీటి నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.


ఇంబ్రహీంపూర్‌లో నిర్మించిన ఇంకుడు గుంతలు

మూడేళ్ల క్రితమే నిర్మించున్న



ప్రభుత్వం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని చెప్పడంతో మూడేళ్ల క్రితం ఇంటి పరిసరాల్లో ఏర్పాటుచేసుకున్న. నిర్మాణం పూర్తికాగానే అధికారులు డబ్బులు కూడా మంజూరు చేశారు. ఇంట్లో అవసరాలకు వాడిన నీరు వృథాగా పోకుండా నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుంది. దీనివల్ల

– దిగంబర్, ఇబ్రహీంపూర్

త్వరలో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం..



జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. వీటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నాం. ఇప్పటివరకు నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు సేకరించి త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– జ్యోతి, డీఆర్‌డీఓ, సంగారెడ్డి

వ్యవసాయ పరిశోధనలపై ప్రత్యేక దృష్టి

వర్డల్ వెజ్ సెంటర్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవాజీ సెల్వరాజ్


ఎంఓయూలను మార్చుకుంటున్న ప్రతినిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వ్యవసాయ రంగంలో ప్రపంచ సవాళ్లను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని వర్ల్‌డ్‌వెజ్ సెంటర్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవాజీ సెల్వరాజ్ అన్నారు. మంగళవారం ఇక్రిశాట్ ప్రాంగణంలోని వర్ల్‌డ్‌వెజ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వర్ల్‌డ్‌వెజ్ సెంటర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రీయ సహకారం , ఆవిష్కరణ పెంపొందించడానికి అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఏఆర్, ఎన్‌బీపీజీఆర్‌లతో కలసి పని చేయడం ద్వారా వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఉమ్మడిగా పోషకాహార భద్రత పెంపొందించడం, స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహిస్తామని చెప్పారు. పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడానికి , జన్యు వనరులను విస్తరించడానికి ఈ ఒప్పందం ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. దీనివల్ల రైతులకు, వినియోగదారులకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం ఐసీఏఆర్–ఎన్‌బీపీజీఆర్ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ... వరల్డ్‌వెజ్ సెంటర్ సహకారం పరిశోధన సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, జన్యు వనరులను విస్తరించడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఒక్కో లారీకి 12 క్వింటాళ్ల తరుగా?


ధాన్యాన్ని పరిశీలిస్తున్న సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వం తీరుతో తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పైతర, కోనాపూర్ గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను, కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి రైతుల నుంచి తూకం వేసిన వడ్ల బస్తాలను మహబూబ్‌నగర్ జిల్లాకు తరలిస్తున్నారన్నారు. అక్కడకు వెళ్లిన ధాన్యాన్ని తరుగు పేరిట ఒక్కో లారీకి 12 క్వింటాళ్ల వరకు రైస్ మిల్లర్ కోత విధిస్తున్న విషయం ట్రక్కు లిస్టుల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ రకమైన దోపిడీకి రైతులు గురవుతున్నారని చెప్పారు. అకాల వర్షాలకు చాలా చోట్ల ధాన్యం తడిసి రంగు మారిందన్నారు. ఎలాంటి కోతలు లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సీపీఎం

మెదక్ కలెక్టరేట్: కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ కేవల్ కిషన్ భవనంలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు మంగళవారం ఆయన హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా పోరాడి అనేక హక్కులు, చట్టాలను సాధించుకున్నట్లు చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను అమలు చేసిందని మండిపడ్డారు. తమ చట్టాలను కాపాడుకోవడం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ, హాస్పిటల్, మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నర్సమ్మ, మల్లేశం, మహేందర్, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

అంటుకుంటే బుగ్గే..

- పారిశ్రామిక వాడల్లో అగ్నిప్రమాదాలు
- తగలబడ్డాక తీరిగ్గా వస్తున్న ఫైరింజన్లు
- సమీపంలో ఫైర్ స్టేషన్ లేకపోవటంతో ఆస్తి నష్టం

జిన్నారం(పటాన్‌చెరు): రసాయన పరిశ్రమలు ఉన్నా సమీపంలో ఒక్క ఫైర్ స్టేషన్ కూడా అందుబాటులో లేదు. కంపెనీల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఇతర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వచ్చేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. మంటలను ఆర్పే వరకు కొన్ని సార్లు ప్రాణ నష్టం కూడా జరుగుతోంది. పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిన్నారం మండలంలోని బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం... గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 140 వరకు ఉంటాయి. ఇందులో ఎక్కువగా రసాయన పరిశ్రమలు ఉంటాయి. ఈ కంపెనీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పలు పారిశ్రామికవాడల్లో ఈ ఎండాకాలం మూడు నెలల వ్యవధిలో పది వరకు అగ్ని ప్రమాదాలు జరిగాయి. మంటలను ఆర్పేందుకు సమీపంలో ఫైర్ స్టేషన్ ఒక్కటి కూడా లేదు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు జీడిమెట్ల, నర్సాపూర్, పటాన్‌చెరు, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వాహనాలు వస్తుంటాయి. అక్కడి నుంచి వచ్చేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుంది. ఆ లోపు జరగాల్సిన ప్రాణ, ఆస్తి నష్టం జరిగిపోతుంది. మైలాన్, అరబిందో, హెటిరో లాంటి పెద్ద పరిశ్రమలు వాటి ఆవరణంలోనే ఫైర్ స్టేషన్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఇతర చిన్న పరిశ్రమల్లో ఎలాంటి అగ్ని ప్రమాదం జరిగినా పెద్ద పరిశ్రమల యాజమాన్యాలు వారి పరిశ్రమలో ఉన్న ఫైర్ ఇంజన్ల తోపాటు ఫోంలను పంపిస్తున్నారు. బొల్లారంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు గతంలో అధికారులు స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు చేపట్టారు. కానీ ఆ ప్రక్రియ మరుగున పడింది. ఇప్పటికైనా జిన్నారం మండలంలోని పారిశ్రామిక వాడలో ఓ ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.


హెటిరో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

ప్రభుత్వానికి నివేదించాం

బొల్లారం, పాశమైలారం పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్‌లను ఏర్పాటు చేసే విషయమై ప్రభుత్వానికి గతంలోనే నివేదించాం. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కృషి చేస్తున్నాం. పరిశ్రమల యాజమాన్యాలు కూడా అగ్ని ప్రమాదాలు జరగకుండా నిబంధనల ప్రకారం సేఫ్టీని పాటించాలి.

– శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి, సంగారెడ్డి

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి టౌన్ : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రూపేష్‌తో కలిసి కలెక్టర్ క్రాంతి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కింపును ప్రారంభించాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతించకూడదని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలకు లోబడి సంబురాలు చేసుకోవాలని సూచించారు.

ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకుందని కలెక్టర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై మాట్లాడారు. కేంద్రాల నుంచి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1,17,987,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 23,054 మంది రైతుల నుంచి సేకరించనట్లు పేర్కొన్నారు. ఇందుకోసం దాదాపు రూ.214 కోట్ల 19 లక్షలు రైతుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం పుల్కల్, అందోల్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశలో ఉందన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

వైభవంగా కల్యాణోత్సవం

జోగిపేట(అందోల్): అందోల్ గ్రామంలోని శ్రీభూనీల సమేత రంగనాథ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రంగనాథస్వామి, రుక్మిణి, సత్యభామ సమేత మురళీకృష్ణ స్వామి వార్ల కల్యాణం ఆలయ అర్చకులు శ్యాంనాథశర్మ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఆయన కూతురు త్రిష మణికంఠ దంపతులు, మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు, రాధిక దంపతులు, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పోల రఘునాథ్ దంపతులు పాల్గొన్నారు. వేడుకలో వినియోగించిన కొబ్బరి కాయలను అర్చకులు వేలం వేశారు. మంత్రి కూతురు త్రిష, మణికంఠ దంపతులు రూ.27,777కు, కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు,రాధిక దంపతులు రూ.24 వేలకు దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ప్రదీప్‌గౌడ్, హరికృష్ణాగౌడ్, సురేందర్‌గౌడ్, కే.నాగరాజు, ప్రవీణ్‌కుమార్, రాములు, రామకృష్ణ, మల్లేశం, సత్యనారాయణ, రొయ్యల శ్రీనివాస్, సందీప్, బిక్షపతి, నాగభూషణం, రామాగౌడ్ ఉన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర

3వేల మొక్కలు సిద్ధంగా ఉంచాలి

అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజ్

జోగిపేట(అందోల్): హరితహారం కార్యక్రమం కోసం ప్రతి నర్సరీలో మూడు వేల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజ్ ఆదేశించారు. మంగళవారం ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులతోపాటు హార్టికల్చర్ మొక్కలను అందుబాటులో ఉంచేలా అవగాహన కల్పించారు. ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీలో బయటపడిన లోటుపాట్లను సరిదిద్దాలని సూచించారు. సామాజిక తనిఖీలో వెలుగుచూసిన రూ.18వేలను రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంద్వారా మండలంలో చేపట్టే పనుల వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీడీఓ రాజేశ్ కుమార్, ఈజీఎస్ ఏపీఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

సంగారెడ్డి టౌన్ : బాలికలు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతీ ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని బాల సదనంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంతానం లేనివారిని పిల్లలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. బాలికల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, బాలల పరిరక్షణ అధికారి రత్నం, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, బాలసదనం సూపరింటెండెంట్ విజయ కుమారి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోతీ

క్లుప్తంగా

ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు

మంత్రి లేఖకు రాష్ట్ర కార్యదర్శి స్పందన

నారాయణఖేడ్: జొన్న రైతులకు శుభ వార్త. ఉమ్మడి మెదక్ జిల్లాలో జొన్న పంట సాగు చేసిన రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోళ్లు జరుగుతున్నాయి. కాగా ఎకరాకు 8 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. దీంతో మిగితా పంట వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకొని రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతీ ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. మంత్రి రాసిన లేఖకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి తక్షణం స్పందించి ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ కోసం భూసేకరణ

రైతులతో ఆర్డీఓ జయచంద్రారెడ్డి సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణలో భాగంగా గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, దాతర్ పల్లి గ్రామాల రైతులతో కార్యాలయంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి భూసేకరణ విషయంలో అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పరిహారం అందించనుందని తెలిపారు. మండలంలోని తొమ్మిది గ్రామాలకు చెందిన రైతుల నుంచి 176 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతుల వివరాలు సేకరించామని, గ్రామాల వారీగా సమావేశం నిర్వహించి రైతులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మండలంలో భూ సేకరణకు పూర్తి కానుందని తెలిపారు.

తండ్రిపై హత్యాయత్నం..

కుమారుడికి 3 నెలలు జైలు

సిద్దిపేటకమాన్: తండ్రిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన కుమారుడికి సిద్దిపేట కోర్టు జైలు శిక్ష విధించింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం నాసర్‌పూరకు చెందిన దొంతరబోయిన రంగయ్యను కుమారుడు దొంతరబోయిన రాజు (30) గొడవపడి కడుపులో తన్ని హత్య చేయడానికి ప్రయత్నించాడు. గాయాలతో బయటపడ్డ రంగయ్య 2019 అక్టోబర్ 30వ తేదీన సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ కొనసాగింది. న్యాయమూర్తి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తుడికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



సుభాష్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలోని పించెరువులో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన పోతరాజ్ సుభాష్ (39) సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత చెరువులో చేపల వేటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం చెరువు సమీపంలో కుటుంబ సభ్యులు వెతకారు. ఒడ్డుపై సుభాష్ బట్టలు కనిపించడంతో అనుమానంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మీనం.. దైన్యం

గ్రౌండ్ రిపోర్ట్

- భానుడి ప్రతాపానికి అడుగంటిన వైనం
- నీళ్లు లేక మృత్యువాత పడుతున్న చేపలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దయనీయ పరిస్థితి
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు

ఎండిపోయిన చెరువులు, కుంటలు

మండుతున్న ఎండలకు చెరువులు, కుంటలు పూర్తిగా అడుగంటిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. చెరువుల్లో నీటి శాతం ఒక్కసారిగా తగ్గిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో చేపలు పట్టి జీవనోపాధి పొందే మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. ప్రస్తుతం మార్కెటింగ్ సౌకర్యం అంతలా లేక చేపలు పట్టకపోవడంతో చెరువుల్లోని చేపలు మృత్యువాత పడి పైకి తేలియాడుతున్నాయి. ఎండల వేడి ఉపాధిపై గొడ్డలి పెట్టులా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాడిపల్లి (నర్సాపూర్) : పూర్తిగా ఎండిపోయి నెర్రెలు వారిన పాంపల్లి చెరువు

క్వింటాళ్ల కొద్ది మృత్యువాత

మిరుదొడ్డి(దుబ్బాక): దంచికొడుతున్న ఎండలకు చెరువులన్నీ ఎండిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో చేపలు పట్టి జీవనోపాధి పొందే మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. ఎండల కారణంగా మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పెద్ద చెరువు, అందెలోని పలు చెరువుల్లో క్వింటాళ్ల కొద్ది చేపలు చనిపోతున్నాయి.



చనిపోయిన ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

నష్టాలనే మిగిల్చాయి

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా 18 గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలు నడుస్తున్నాయి. చేపలు పడుతూ జీవనం సాగిస్తున్న వారు దాదాపు 1,098 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండగా మారాయి. మత్స్యకారుల జీవనోపాధికై జిల్లా మత్స్య సహకార సంఘం ద్వారా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. మత్స్యకారులకు లాభాలు తెచ్చిపెట్టే చేపల కన్న, నష్టాన్ని తెచ్చిపెట్టే క్యాట్ ఫిష్ ఎక్కువగా చెరువు కుంటల్లో పెరిగింది. ఎదిగే కొద్ది ఈ చేపలు కాస్త మిగితా చేపలను తినివేయడం, వాటి ఎదుగుదల పై ప్రభావం చూపడం మత్స్యకారులకు తలనొప్పిగా మారింది. దీనికి తోడు చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో చేపలు చనిపోతున్నాయి.

క్యాట్ ఫిష్‌తో నష్టం



ఇప్పటికే ఎండలకు చెరువులు, కుంటలు అడుగంటిపోయాయి. ఉన్న చేపలను పట్టి అమ్ముకుందామంటే పంపిణీ చేసిన చేప పిల్లల్లో క్యాట్ ఫిష్‌లు చేరడం ఉన్న కొద్దిపాటి నీళ్లలోకి దిగి చేపలను పడదామంటే అవే వలలకు చిక్కుతున్నాయి. అక్కడే వాటిని చంపి పారవేయాల్సి వస్తుంది.

– గంగారాంలు, మత్సకారుడు రంగంపేట



నీరు ఇంకిపోతుండడంతో రంగంపేట తురకల చెరువులో మత్స్యకారుల వేట

15 శాతం కంటే తక్కువ నీరు



దుబ్బాకలోని ఏదుల్ల చెరువులో గుర్రపు డెక్క

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని పెద్ద చెరువు, నల్ల చెరువు, రామసముద్రం చెరువు, ఏదుల్ల చెరువులను 'సాక్షి' పరిశీలించగా అన్ని చెరువుల్లో కేవలం 15 శాతం కంటే తక్కువ గానే నీరుంది. ఇక ఏదుల్ల చెరువు పూర్తిగా ఎండిపోయి కేవలం జేసీబీ గుంతల్లో కొద్దిగా నీరుండడంతో చేపలు చనిపోతున్నాయి. అన్ని చెరువుల్లో కేవలం జేసీబీ గుంతల్లోనే నీరు తప్ప మొత్తం అడుగంటి పోయి గుర్రపు డెక్క, నెర్రలు వారిన మట్టి కనిపిస్తుంది. చేపలు ఎక్కడికక్కడ చనిపోతుండడంతో ఏం చేయాలో తోచక మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కుప్పలు తెప్పలుగా..





ఎండ తట్టుకోలేక చనిపోయిన చేపలు

వారం రోజుల వరకు వాతావరణం కొంత చల్లబడినా మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. జనాలు ఉక్కపోత భరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మనుషులే కాదు జీవరాశులు సైతం ఎండ వేడిమి తట్టుకోలేక పోతున్నాయి. చెరువుల్లో ఉన్న వందల కొద్ది చేపలు మృత్యువాత పడుతున్నాయి. సంగారెడ్డి నుంచి అందోల్ వెళ్లే దారిలోని చెరువులో ఇలా చచ్చిపోయిన చేపలు కనిపించాయి.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



8 క్వింటాళ్లు మాత్రమే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో 42 చెరువు, కుంటలు ఉన్నాయి. తిగుల్‌లో రాచకట్ల జలాశయం, ధర్మారంలో బొరబండ ప్రాజెక్టులో కొద్దిపాటి నీరు ఉంది. మిగితా చాలా గ్రామాల్లో చెరువులన్నీ ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. తిగుల్ గ్రామంలో మహాసముద్రంలో గతేడాది 50 వేల చేప పిల్లలను వదిలారు. గ్రామంలో 120 మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. గతేడాది 15 క్వింటాళ్ల చేపలు పట్టగా ఈసారి ఇప్పటికి కేవలం 8 క్వింటాళ్లు మాత్రమే పట్టారు. ప్రస్తుతం చెరువులో చిన్నపాటి గుంతలో నీరు తప్ప చెరువు మొత్తం ఎండిపోయింది.



ఎండిపోయిన తిగుల్‌లోని మహాసముద్రం

తక్కువ ధరకు అమ్ముతూ..

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలో పదిహేను చెరువుల్లో మత్సకారులు చేపలను పెంచుతున్నారు. ప్రభుత్వం మత్స్య సహకార సంఘానికి ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలు పెరగలేదని ప్రైవేటుగా కొనుగోలు చేసిన చేప పిల్లలు మాత్రం పెరిగాయని తునికి మత్స్యసహకార సంఘం చైర్మన్ చల్లకుమార్‌తోపాటు పలువురు మత్స్యకారులు తెలిపారు. చెరువుల్లో నీళ్లు అడుగంటి పోవడంతో అందులోని చేపలు రోజు చనిపోతున్నాయన్నారు. దీంతో చేసేది లేక చిన్న చేపలను పట్టి తక్కువ ధరకు అమ్ముతుండటంతో నష్టపోతున్నామని వాపోయారు.



కౌడిపల్లి పెద్ద చెరువులో తగ్గిన నీరు

రూ. 2 లక్షలు నష్టం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి ఊర చెరువు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ చెరువులో చేపలు పట్టుకొని తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లోని 130 కుటుంబాలు జీవనం సాగిస్తాయి. వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో చెరువులో పోసిన చేపలు ఎదగలేదు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చిన చేపల పిల్లలను ఆలస్యంగా ఇవ్వడంతో వాటిని చెరువుల్లో పోస్తే పెద్ద చేపలకు ఆహారం అయ్యాయి. ఈ చెరువులో చేపలను చూసి మత్స్యకారుడు ఏడాదికి రూ.4 లక్షలకు లీజుకు తీసుకున్నాడు. ఒకసారి చేపలు పడితే 15 క్వింటాళ్ల వస్తే వాటిని మార్కెట్‌కు తీసుకెళ్తే రూ.1.10 లక్షలు వచ్చాయి. మరో సారి చేపలు పడితే టన్ను వరకు వస్తే రూ.70 వేలు వస్తాయి. మరో రూ.2 లక్షలు మత్స్యకారులకు నష్టం జరిగింది.



వలలను సర్దుకుంటున్న మత్స్యకారులు

చేపలు పెరగలేదు



ఐదేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురువడంతో చెరువుల్లో చేపల పెరిగి లాభాలు వచ్చేది. ఇప్పుడు చేపలను మరో ఊరు వాళ్లకు ఎందుకియ్యాలని నేను పొరుగురు అతడితో కలిసి గుత్తకు పట్టిన. ఎండలకు చెరువు నీళ్లు లేక చేపలు పెరగలేదు.

– పోలవేని శ్రీనివాస్, మత్స్యకారుడు తోటపల్లి

తూప్రాన్ రిజిస్ట్రార్ అరెస్ట్

- నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించిన కేసులో..
- మరో ఎనిమిది మంది రిమాండ్

మనోహరాబాద్(తూప్రాన్): నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసిన తూప్రాన్ రిజిస్ట్రార్‌ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడితోపాటు మరో నలుగురిని సైతం అదుపులోకి తీసుకున్నారు. మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో 225, 256 సర్వే నంబర్‌లో వెయ్యి గజాల స్థలంకు హైదరాబాద్‌కు చెందిన మల్లవరపు అరుణ్‌కుమార్ అనే వ్యక్తి మరో 8 మందితో కలిసి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించారు. ఈ డాక్యుమెంట్ ద్వారా హైదరాబాద్ మోతీనగర్‌కు చెందిన సురవజ్జుల సత్యనారాయణమూర్తి భార్య స్వాతికి రూ.80 లక్షలకు తూప్రాన్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్‌ను ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఈ ప్లాట్ లింకు డాక్యుమెంట్ల కోసం సత్యనారాయణమూర్తి ఆరాతీయగా, అమ్మిన వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు.



అరెస్ట్ చేసిన వారిని చూపుతున్న పోలీసులు

తన ప్లాట్ కోసం కూచారం గ్రామానికి వచ్చి చూడగా ఆ స్థలం వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండటంతో అసలు విషయం బయటపడింది. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఫిబ్రవరిలో పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఏప్రిల్ నెలలో నలుగురిని గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో విచారణ పూర్తి కావడంతో మంగళవారం తూప్రాన్ రిజిస్ట్రార్ రమణతోపాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


131 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వట్‌పల్లిలో 101, గజ్వేల్‌లో 30 క్వింటాళ్లు

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంపత్‌కుమార్ కథనం మేరకు.. వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ వద్ద సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో డీసీఎం వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 205 బ్యాగుల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వెంటనే సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించి అందోలులోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. దాదాపుగా 101 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్ మహ్మద్ ఫయాజ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోలో తరలింపు

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాడోత్ రాజేందర్, బుక్య శ్రీకాంత్‌లు ట్రాలీ ఆటోలో గజ్వేల్ మండల పరిధిలోని సమీప గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు వెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి గ్రామ శివారులో ఆటోను అదుపులోకి తీసుకొని 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గజ్వేల్ రూరల్ : నిందితులతో పోలీసులు

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగారెడ్డి: శుభకార్యాయానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చౌటకూరు మండల పరిధిలోని శివంపేట వద్ద మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. పుల్కల్ మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన మంగలి వీరేశం (45) సోమవారం సాయంత్రం ముత్తంగిలోని అత్తగారింటి వద్ద శుభకార్యానికి భార్యాపిల్లలతో కలిసి వెళ్లారు. భోజనం ముగించుకున్న తర్వాత అర్ధరాత్రి వీరేశం ఒక్కడే బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. చౌటకూరు మండలంలోని శివంపేట మలుపు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో వీరేశానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు ఆత్మహత్య

ప్రేమ విఫలమై యువకుడు

జహీరాబాద్ టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జహీరాబాద్ మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.ప్రసాద్ కథనం మేరకు.. జహీరాబాద్ మండలంలోని అనేగుంట గ్రామానికి చెందిన గొల్ల గాళప్ప కుమారుడు గొల్ల వెంకట్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన యువతితో ఏడాది కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లిచేసుకోవాలని నిర్ణయించారు. పెళ్లి కోసం వారం రోజుల కిందట వెంకట్ తండ్రితో కలిసి బాల్కొండకు వెళ్లి యువతి తల్లిదండ్రులను అడిగారు. పెళ్లికి అమ్మాయి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో వెంకట్ మనస్తాపానికి గురై మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అప్పుల బాధతో వ్యక్తి

నిజాంపేట(మెదక్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన కోమ్మట రాజు(25) జేసీబీ మిషన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. రాజు వ్యవసాయ పెట్టుబడి కోసం తెలిసివారి వద్ద రూ. 2 లక్షల అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మనస్తాపంతో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు సాయంత్రానికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతుకున్న క్రమంలో మంగళవారం ఉదయం తనం పొలం వద్ద ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యానికి బానిసై..

చిన్నశంకరంపేట(మెదక్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పిట్ల సురేశ్ (30) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఎలాంటి పనులు చేయక ఇంటివద్దనే ఉంటుండడంతో కుటుంబ పోషణ భారమైంది. ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

పరామర్శకు వెళ్లి వస్తుండగా..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో
- పదకొండు నెలల చిన్నారి మృతి, ఐదుగురికి గాయాలు



మాధురీదీప్తి

చేగుంట(తూప్రాన్): ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో పదకొండు నెలల చిన్నారి మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మక్కరాజీపేట గ్రామానికి చెందిన మైలారం ఎల్లం, భార్య సౌందర్య ముగ్గురు పిల్లలను తీసుకొని నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో బంధువులను పరామర్శించేందుకు సోమవారం సాయంత్రం వెళ్లారు. అక్కడ చిన్నపాటి గొడవ జరగడంతో మక్కరాజీపేటలో తన అన్న లక్ష్మణ్‌కు ఎల్లం ఫోన్ చేశాడు. విషయం తెలుసుకున్న లక్ష్మణ్, గ్రామానికి చెందిన స్వామి, మాసని బాబు, మైలారం లక్ష్మి ఆటోలో వల్లూర్‌కు వచ్చారు. అర్ధరాత్రి వరకు గొడవ గురించి మాట్లాడుకున్నారు. రాత్రి ఒంటిగంట తర్వాత లక్ష్మణ్, స్వామి బైక్‌పై మిగితా వారు ఆటోలో మక్కరాజీపేటకు బయలు దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రెడ్డిపల్లి కాలనీ వద్ద ఆగి ఉన్న లారీని ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మాసని బాబు, లక్ష్మి, సౌందర్య, స్వామిలతోపాటు చిన్నపిల్లలు వెంకటేశ్, విష్ణువర్ధన్‌లకు గాయాలయ్యాయి. చిన్నారి మాధురి దీప్తి స్పృహ తప్పి పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాధురీ దీప్తిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కే.పురుశోత్తం రెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్‌కు చెందిన ఎండీ. అన్వర్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు హనీఫ్ ఖాన్, రోషన్ జాతవ్, ముఖేష్ వర్మ, భీరం సింగ్ వర్మ కలిసి ముఠాగా ఏర్పడి పెట్రోల్ బంకులు, రహదారుల వెంబడి రాత్రి పూట నిలిపిన లారీల్లోంచి డీజిల్‌ను దొంగిలిస్తూ వచ్చే డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డారన్నారు. 2024 జనవరి 1వ తేదీన కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో అర్ధరాత్రి రోడ్డు పక్కన ఆపిన లారీ నుంచి 300 లీటర్ల డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. నెల్లూరు జిల్లాకు చెందిన డ్రైవరు ఆది గోపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ముఠాను పట్టుకునేందుకు అడిషినల్ డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షణలో ఏసీపీ పురుశోత్తం రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌లతోపాటు మరి కొందరు సిబ్బందితో ప్రత్యేక టీంగా ఏర్పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున వెలికట్ట శివారులో చేర్యాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా 2 డీసీఎంలలో డీజిల్ క్యాన్లు తీసుకెళ్తున్న నలుగురిని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా జగదేవ్‌పూర్, తూప్రాన్, కుకునూరుపల్లి, వెలికట్ట గ్రామాల శివారుల్లో రోడ్ల వెంబడి నిలిపి ఉన్న లారీల్లోంచి డీజిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారన్నారు. ఇందులో శంషాబాద్‌కు చెందిన ఎండీ. అన్వర్ పరారీలో ఉన్నాడు. నలుగురు నిందితులను సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించాలని తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుశోత్తంరెడ్డి

గోడ కూలి మహిళ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): గోడ కూలి మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముత్తాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎరుకల సువర్ణ(35) అదే గ్రామానికి చెందిన చాకలి శ్యామయ్య ఇంటికి కూలీ పని కోసం వెళ్లింది. ఇల్లు మరమ్మతు చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గోడ కూలి సువర్ణపై పడింది. ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న క్రమంలో ఆమెను బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమెతో పాటు మేస్త్రీ రవీందర్‌కు గాయాలయ్యాయి. ఎస్ఐ ఆనంద్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.